క్లుప్తంగా

వైభవంగా కలశ స్థాపన పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

సిద్దవటం: భాకరాపేట నూతనంగా నిర్మించిన భవాని శంకర్ స్వామి ఆలయంలో సోమవారం కలశ స్థాపన పూజలు వేదపండితులు వైభవంగా నిర్వహించారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామంలో భవాని శంకర్ స్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం గోపూజ, గంగాదేవి పూజ, గణపతిపూజ, పుణ్యాహావాచనం, అగ్నిప్రతిష్ఠ, దీక్షా హోమం, మృత్యంగ్రహణము, అంకురార్పణం, జలాదివాచము వంటి పూజా కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భూ కబ్జాలపై వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చిట్వేలి: చిట్వేలి మండలంలో భూ కబ్జాలపై తహసీల్దార్ మోహన్‌కృష్ణకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సోమవారం రైల్వేకోడూరు నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్యతో కలిసి తిమ్మాయపాలెం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 2లో కబ్జాకు గురైన భూమిని పరిశీలించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశామని సీపీఐ మండల కార్యదర్శి తిప్పన ప్రసాద్ తెలిపారు. భూ కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములను గుర్తించి భూమిలేని పేదలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలి శ్రీదేవి, శ్రీనివాసులు, వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

గాలి, వాన బీభత్సం



నీలకంఠ్రావుపేట గ్రామంలో గాలికి ఎగిరిపోయిన ఇంటి పై కప్పు

రామాపురం: మండలంలో పలుచోట్ల ఆదివారం రాత్రి ఈదురు గాలులు వర్షంతో అపార నష్టం జరిగింది. చాలా చోట్ల చేతికి అందిన పంట తడిసిపోయి రైతులు లబోదిబోమన్నారు. మామిడిచెట్లు నేలకొరిగాయి. చేతికొచ్చిన పంట మామిడికాయలు చాలా చోట్ల రాలిపోయాయని, కొన్ని చోట్లు ఇంటి పైకప్పులు పూర్తిగా లేచిపోయాయి. కడప - రాయచోటి ప్రధాన రహదారిలో ఉన్న నీలకంఠ్రావు బయట సమీపంలో రేకుల షెడ్డు వేసుకొని హోటల్‌తో జీవనోపాధి సాగిస్తున్న ప్రమీళ, మస్తాన్ అనే వారికి చెందిన రేకుల షెడ్లు పూర్తిగా లేచిపోయాయి. దాదాపు రూ. 200లక్షలు వరకు నష్టం జరిగిందని లబోదిబోమన్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న విశ్వనాథ

రాయచోటి అర్బన్: ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి ఎం. విశ్వనాథ ప్రభుత్వ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఉపాధి వేతానాలు చెల్లించాలని జేసీ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేశారు. రాయచోటి మండలంలోని మాధవరం, గొర్లముదివీడు గ్రామాల్లోని కూలీలకు పెండింగ్‌లో కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధి కూలీలకు పనిదినాలను 200 రోజులకు పెంచాలన్నారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కమిటీ సభ్యులు రమణ, సుజాత పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తెస్తాం



నియామకపత్రం అందుకుంటున్న అహమ్మద్

రాయచోటి జగదాంబసెంటర్ : కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తామని ఆ పార్టీ అన్నమయ్య జిల్లా మైనార్టీ సెక్రటరీ అత్తార్ అహమ్మద్ అన్నారు. అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెక్రటరీగా రాయచోటి పట్టణానికి చెందిన అత్తార్ అహమ్మద్‌ను నియమించారు. సోమవారం డీసీసీ మైనార్టీ చైర్మన్ సయ్యద్‌ఆలీ, ఏపీసీసీ డెలిగేట్ ఎస్ఎండీ గౌస్‌లు అత్తార్ అహమ్మద్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అహమ్మద్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు ఈ ధన్యవాదాలు తెలిపారు.

మూగజీవాల.. దప్పిక తీరేదెలా?

పల్లెల్లో మూగజీవాల దాహం కేకలు వినిపిస్తున్నాయి. దాహార్తిని తీర్చాలనే సదుద్దేశంతో ఊరి బయట, పొలాలకు వెళ్లే దారుల్లో, రోడ్ల వెంబడి నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. నోరు తెరిచి దాహం అని చెప్పలేని పశువులు, మేకలు, గొర్రెలు పక్షులకు నీరు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ నీటి తొట్లు నీళ్లు లేక ఎండిపోయాయి. నిర్వహణ మరిచిపోవడంతో చాలా చోట్ల చెత్త నిలయాలుగా మారిపోయాయి.

- నిరుపయోగంగా నీటి తొట్లు
- దాహంతో అలమటిస్తున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

సిద్దవటం: వేసవి కాలంలో మూగజీవాల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన నీటి తొట్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఒక తొట్టి నిర్మాణానికి రూ. 15వేలు ఖర్చు చేశారు. ఒక్కొక్క పంచాయతీలో పశువులను అంచనా వేసి నీటి తొట్లు నిర్మాణం చేపట్టారు. గ్రామ పంచాయతీకి 2 నుంచి 3 తొట్ల వరకు నిర్మించారు. 2012-13 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వ తొట్లను ఏర్పాటు చేసింది. అయితే తొట్లలో నీటిని నింపిన దాఖలాలు లేవని మండల వాసులు వాపోతున్నారు. కరువు పరిస్థితుల్లో ప్రభుత్వ తొట్లలో నీటిని నింపితే పశువుల దాహార్తి తీరుతుందని పలువురు పేర్కొంటున్నారు. సాగు నీటి వనరులు, బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. పగటి పూట మేత, నీటి కోసం పశువులు అలమటిస్తున్నాయి.

నీటితొట్లలో చెత్తా చెదారం

మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో 13 నీటి తొట్లు ఉన్నాయి. కొన్ని నీటి తొట్లు చెత్తా చెదారంతో నిండిపోయాయి. పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖ గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి తొట్లలో నీరు నింపాలని రైతులు కోరుతున్నారు.

విలవిల

మండలవ్యాప్తంగా 8,600 పశువులు, గొర్రెలు, మేకులు కలిపి 17,000 ఉన్నాయి. మూగ జీవాలకు ఒకపక్క పశుగ్రాసం కొరత వేధిస్తోంది. మరోపక్క తాగునీటి కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది.

తొట్లలో నీళ్లు నింపాలి



గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్లను ఏర్పాటు చేశారు. తొట్లలో ఇప్పటి వరకు నీళ్ల నింపలేదు. నీటి తొట్లను ఏర్పాటు చేయడంతో ఉన్న శ్రద్ధ వాటిని వినియోగంలోకి తేవడంలో చూపించలేదు. అధికారులు స్పందించి తొట్లలో నీరు నింపాలి.

-కోటపాటి సుబ్బరాయుడు, సిద్దవటం

అధికారులు పట్టించుకోవడం లేదు



సిద్దవటం మండలంలోని మూలపల్లె, మాధవరం-1, ఉప్పరపల్లె, కొత్తమాధవరం గ్రామాల్లో కూడా పశువులు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ నీటి తొట్ల నిర్మాణం చేపట్టలేదు. అధికారులు పంచాయతీల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటికైనా గ్రామాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేయాలి.

-కె. వెంకటరామిరెడ్డి, మాధవరం-1 , సిద్దవటం

ఎన్నికల హామీలను విస్మరిస్తున్న 'కూటమి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన ఎస్సీ విభాగం రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం చరిత్రలో బడుగు బలహీన వర్గాలకు, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే ఒక్క జగనన్న ప్రభుత మాత్రమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎస్సీలందరూ ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం కావడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎన్నో పథకాలు అమలు చేశారని తెలిపారు. దళితులు పోరాటాలు చేసి హక్కులను దక్కించుకోవాలని పిలుపునిచ్చారు.

నేడు ఎస్టీలకు మద్దతుగా నిరసన

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ తిమోసి నగర్‌లో గిరిజనుల ఇండ్ల స్థలాల్లో అక్రమంగా చెట్లను తొలగించిన అగ్రవర్ణాలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం నిరసన చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను తొలగించినవారిపై ఎస్సీ, ఎస్సీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం చేసేంత వరకు పోరాడుతామని తెలిపారు.

జంగాపల్లెలో వైద్య బృందం పర్యటన



మురుగు నీటిలో అబెట్ ద్రావణాన్ని చల్లుతున్న చేస్తున్న వైద్య సిబ్బంది

సిద్దవటం: మండలంలోని జంగాలపల్లె ఎస్సీ కాలనీలో సోమవారం పి. కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య బృందం పర్యటించారు. పి. కొత్తపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి ఆధ్వర్యంలో జంగాలపల్లె గ్రామంలో పర్యటించి అపరిశుభ్రంగా, మురుగు నీటి ప్రాంతాలలో అబెట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగలక్ష్మి మాట్లాడుతూ కాలనీలో విష జ్వరాలు తగ్గుముఖం పట్టాయని, కొంత మందికి రక్త నమూనాలను సేకరించమని తెలిపారు. స్థానికులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని తెలిపారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ మౌలాలి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

లక్కిరెడ్డిపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 24వ తేదీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉషారాణి తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యంగా తాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, ఉపాధి, రోడ్లు, ఇల్లు తదితర విషయాలపై చర్చించనున్నట్లు ఆమె తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి



వినతి ప్రతం స్వీకరిస్తున్న తహసీల్దార్

గాలివీడు : భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో కలసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని గోరాన్ చెరువు గ్రామపరిధిలోని గేటు వద్ద నివాసముంటున్న చెన్నూరి వెంకట్రాయుడు తన నివాసానికి అడ్డుగా ఇంటిలోకి వెళ్లేందుకు వీలులేకుండా ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చెయ్యడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చెయ్యగా సదరు అర్జీదారుని సమస్యను పరిష్కరించాలంటూ విద్యుత్ అధికారులకు ఆమె బదిలీ చేశారు.

మాన్యం భూముల వేలం

చిట్వేలి: మండల కేంద్రమైన చిట్వేలిలో నాలుగు ఆలయాలకు సంబంధించి మాన్యం భూములను ఆరు సంవత్సరాల కాలపరిమితితో వేలంపాట నిర్వహిస్తామని రాజంపేట గ్రూప్ ఆలయాల ఈవీఓ కొండారెడ్డి తెలియజేశారు. సోమవారం ఆయన గ్రామంలోని శ్రీ శ్యామలాంబ సమేత శ్రీ సోమేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ వరద రాజస్వామి, శ్రీ భద్రకాళి వీరభద్రుడు స్వామి ఆలయాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గత వేలంపాటను రద్దు చేశామన్నారు. పది రోజుల తరువాత దండోరా వేయించి కొత్తవేలంపాటను నిర్వహిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

రాయచోటి : రాయచోటి మదనపల్లి మార్గం ఏజీ గార్డెన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం 9 సంవత్సరాలు చిన్నారి మృతి చెందింది. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో రోడ్డుకు ఎడమవైపు కోటకొండ యశస్మిత (9) వస్తుండగా గుర్రంకొండ నుంచి టమాటాల లోటుతో వచ్చిన బొలెరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలోయశస్మిత మృతి చెందింది. చిన్నమండెం మండలం చాకిబండ కురవపల్లికి చెందిన కోటకొండ రామదాసు కొన్ని సంవత్సరాలుగా ఏజీ గార్డెన్ కాలనీలో నివాసం ఉంటున్నారు. రాత్రి దుకాణం దగ్గర నుంచి ఇంటికి వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కుమార్తె మరణ వార్త తల్లిదండ్రులను శోకసముద్రంలో నింపింది. సంఘటనపై రాయచోటి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మురుగునీరు తొలగింపు



మురుగునీరు తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

గాలివీడు : బస్టాండ్ వద్ద పెద్దూరు మార్గంలో రహదారిపై ప్రవహిస్తున్న డ్రైనేజీ మురుగునీటిని సర్పంచ్ లక్ష్మీదేవమ్మ,పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో తొలగించారు. ఇటీవల ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పొంగిపొర్లిన మురుగు కాలువ నీరు రహదారి వెంబడి ప్రవహించడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే పెద్దూరు మార్గం దుర్గంధంతో ముక్కులు మూసుకునే పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి సమస్యపై ఆరాతీసి పంచాయతీ సిబ్బందితో కలసి సేఫ్టీ ట్యాంక్ ద్వారా పైపులతో మురుగునీటిని పూర్తిగా తొలగించారు.మురుగునీరు తొలగించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం 60 మంది 6వ తరగతి ప్రవేశపరీక్షలకు దరఖాస్తులు చేసుకోగా 58 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సంబేపల్లె పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రవేశ పరీక్ష

మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల ప్రవేశాలకు సోమవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్, జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాల సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో 5 వతరగతి పూర్తి చేసి 6 వ తరగతిలో ప్రవేశం కల్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. నేటి నుంచి ఈ నెల 23 వరకు విద్యార్థులను నూతన తరగతులలో చేర్పించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్డుదారులు ఈ కేవైసీ పూర్తి చేసుకోండి

మదనపల్లి: రేషన్ కార్డ్ లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ ప్రక్రియను సులభంగా పూర్తి చేసుకునేలా గ్రామాలకు ఎండీయూ వాహనాలను పంపుతూ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి డివిజన్ పరిధిలో ఈ కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు 32,000 మంది ఉన్నారన్నారు. మదనపల్లి మండలంలో సుమారు 12000 మంది ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు. రేషన్ పంపిణీలో పారదర్శకత తీసుకురావడానికి ఈ కేవైసీ చేస్తున్నామన్నారు.

కరుణించమ్మా.. గంగమ్మా



ఆకేపాటిని సన్మానిస్తున్న నాయకులు

వీరబల్లి: కరుణించమ్మా.. గంగమ్మా అని రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథరెడ్డి వేడుకున్నారు. సోమవారం సానిపాయి గంగమ్మ జాతర జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ నాయకుల కోరిక మేరకు ఆయన సానిపాయి పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ సానిపాయి గంగమ్మ తల్లి అందరినీ చల్లగా దీవించాలని కోరారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి, కలిసికట్టుగా పాటుపడాలని కోరారు. అనందరం అమరనాథ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు నరేష్ స్వామి, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి నాయకులు వీరనాగిరెడ్డి, మదన్ రెడ్డి, మణిరాజు, అజయ్ రెడ్డి, ఆర్ఎం రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని వ్యవసాయ అధికారిణి మల్లిక తెలిపారు. సోమవారం బాలిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ద్రవ జీవామృతం చీడపీడల నివారణ కొరకు కషాయాలు ఏ విధంగా తయారు చేయాలో రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌పీ రత్నమ్మ, మాజీ ఎంపీటీసీ గురు ప్రసాద్, ఎంపీసీ బుల్లయ్య, విలేజ్ అసిస్టెంట్ రామయ్య, తిరుపాలు, వీఆర్‌ఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి ఎస్. బిందు తదితరులు పాల్గొన్నారు.

సారూ.. మా సమస్యలు పరిష్కరించండి

పుల్లంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా స్పందన కరువైందని వాపోతున్నారు. తమకు సంబంధించిన భూములను ఆన్‌లైన్‌లో మరొకరి పేరు మార్చారని, ఆరు నెలలు అయినప్పటికీ అధికారుల్లో చలనం లేదని, అప్పారాజుపేట గ్రామ పంచాయతీకి చెందిన ముంతాజ్ బేగమ్ ఆరోపించారు. అనంతంపల్లి గ్రామానికి చెందిన పొత్తమి సోమశేఖర్ రెడ్డి భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఏడు నెలలు కావస్తున్నా ఇంతవరకు సమస్య పరిష్కరించలేదన్నారు. మండల వ్యాప్తంగా దళవాయిపల్లి, కొమ్మనవారిపల్లి, తిమ్మాయిపల్లి, బావికాడపల్లిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా భూ ఆక్రమణపై విచారణ చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేడు గోపగుడిపల్లెలో రీసర్వేపై గ్రామసభ

రామాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుందని తహసీల్దార్ రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గోపగుడిపల్లెలో మంగళవారం ఉదయం 10గంటలకు భూ రీ సర్వేపై అవగాహన కల్పించేందుకు రైతులతో గ్రామసభ నిర్వహిస్తామని, రీసర్వేలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో కొత్తగా భూ సర్వే చేసి హద్దులు నిర్ధారించనున్నట్లు తెలిపారు. ఒక్కో బ్లాకుగా విభజించి షెడ్యూల్‌ను తయారు చేసుకొని రీ సర్వే నిర్వహిస్తామని తెలిపారు.

గురువుల సేవలు మరువలేనివి



ఉమర్ సాహెబ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వీరబల్లి: గురువుల సేవలు మరువలేనివని మండల విద్యాశాఖ అధికారి కృష్ణయ్య తెలిపారు. సోమవారం మండలంలోని ఓడివీడు పంచాయతీలో సీతంపేట ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న ఉమర్ సాహెబ్ పదవీ విరమణ పొందడంతో ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సేవలు మరువలేనివని తెలిపారు. ఉపాధ్యాయుడు ఎంతోమందిని విద్యావంతులు చేయడమే కాకుండా దేశానికి ఉపయోగపడే విద్యావంతులను తీర్చిదిద్దడంలో ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు. అనంతరం ఆయన్ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సంఘాల నాయకులు ధర్మారెడ్డి, ర ఘు ప్రసాద్, మధుసూదన్ రెడ్డి, నరసింహారెడ్డి, అంగన్ వాడీ టీచర్ రాణి, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

సుండుపల్లె : విద్యతోనే సమాజ వికాసం ముడిపడి ఉందని. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని మండల విద్యాశాఖ అధికారులు వెంకటేష్‌నాయక్, రవీంద్రనాయక్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) అనుసరించి అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాలు అమలు చేయాలని తెలిపారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన వారు (అనాధ పిల్లలు, దివ్యాంగులు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలు) కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీనవర్గాలకు (బీసీ, మైనార్టీ, ఓసీ) లకు చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అర్హత కలిగిన పిల్లలకు ఒకటో తరగతి విద్యార్థుల నమోదు 25 శాతం సీట్లు కేటాయించి రీయింబర్స్‌మెంట్ పద్ధతిని 2025-26 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ప్రవేశం కల్పించడం జరుగుతుందని వారు తెలిపారు. అన్ని ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్లు, సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

సిద్దవటం: దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి తెలిపారు. మండలంలోని పి. కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జ్యోతి, గొల్లపల్లె గ్రామాల్లో సోమవారం దోమల నివారణకు ఇంటింటికీ ఏసీఎం కెమికల్ 5 శాతం స్ప్రేయింగ్ చేయించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమల నివారణకు నివాస గృహాల్లో స్ప్రేయింగ్ చేయించుకోవాలని సూచించారు. గతంలో ఈ ప్రాంతంలో ఎక్కువగా మలేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. దోమలు కుట్టకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని కోరారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు, హెల్త్ సూపర్‌వైజర్లు మౌలాలి, పద్మావతి, ఆరోగ్యకార్యకర్తలు నాగరత్నమ్మ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం సకల శుభాలకు సోపానం



గువ్వలచెరువులో పర్యటించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి: సీతారాముల కల్యాణం సకల శుభాలకు సోపానమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి మండలం, అప్పకొండయ్యగారిపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన సీతారాముల కల్యాణంలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని దేవుడిని కోరుతున్నట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, భాస్కర్, హరినాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ.. పలకరింపులు

రామాపురం: మండలంలోని గువ్వలచెరువులో సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో మమేకమయ్యారు. అన్ని వీధులలో కలియతిరుగుతూ అందరినీ ఆప్యాయంగా పలకరించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు, వేరుశనగ పంట దెబ్బతిన్నా ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఈ ప్రభుత్వం అందించలేదంటూ ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.

పరామర్శ

ఇటీవల కాలంలో ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి పొందున్న మాజీ ఆప్షన్ సభ్యుడు ఫైరోజ్ అలీని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కాలు విరిగి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఎర్రనాగి ఓబులేసును పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బాషఖాన్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మేదరపల్లెలో హసనాపురం సుబ్బయ్య సతీమణి గంగాదేవి గుండె జబ్బుకు వైద్యం పొంది ఇంటి వద్ద విశ్రాంతి పొందుచున్న ఈమె నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ సుబ్బయ్య, ఎంపీటీసీ మౌలా, మాజీ సర్పంచ్ ముబారక్, నాయకులు నారాయణ, బీసీ సెల్‌రాష్ట జాయింట్ సెక్రటరీ ఆర్ల సుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ రాజా, డాక్టర్ రమణ, మాజీ కో ఆప్షన్ జిలాన్, వలి, బలరాం, మాజీ డీలర్ శ్రీను, షంషీర్, ఉప సర్పంచ్ రాఘవయ్య, చీకటి ఉదయ్‌కుమార్, కుమారస్వామి, శేఖర్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.